

క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఈటల, ఎమ్మెల్సీ దయానంద్

గోమాత ఆరాధన సర్వ దేవతారాధన

● ఎంపీ ఈటల రాజేందర్

చాదర్‌ఘాట్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గోవులకు సేవచేయడం, గోమాతను ఆరాధించడం ద్వారా సర్వ దేవతారాధన నిర్వహించిన వారవుతారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం రాత్రి శాలివాహననగర్‌కాలనీలోని నారాయణి గోసేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన నారాయణి గోశాలలో నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీ-2025ను ఆయన ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవులను ఆరాధించే పవిత్ర సంస్కృతి, సంప్రదాయం మన హిందువుల్లోనే ఉందన్నారు. అంతకుముందు ఆయన గోశాలలోని గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణి గోసేవా సమితి ట్రస్టీలు అమన్ సోనీ, డీపీ తివారి, మోహన్‌బాబు, సజ్జన్ దాగా, పవన్ అగర్వాల్ గోశాల సేవకులు అంబారి పవన్, కె.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : బలాల



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

ఓల్డ్‌మలక్‌పేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే బలాల అన్నారు. సోమవారం ఓల్డ్‌మలక్‌పేటలోని కమ్యూనిటీ హాల్‌లో ఎంఐఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్యశిబిరాల వల్ల పేద మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతదన్నారు. ఎంఐఎం డివిజన్ అధ్యక్షుడు షఫి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ప్రజలకు ఉచిత వైద్యశిబిరాలతో పాటు వివిధ సమాజసేవా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్లు రోగులను పరీక్షించి ఉచితంగా పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

గురుకుల పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించాలి

● టీచర్స్ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

వనస్థలిపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గురుకుల పెన్షనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీచర్స్ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. సోమవారం వనస్థలిపురంలో సాంఘిక సంక్షేమ గురుకులాల రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్సీ మాట్లాడుతూ పెన్షనర్స్‌కు మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని, మార్చి 2024 నుంచి రిటైర్డ్ అయిన వారికి పెన్షన్ బెనిఫిట్స్ విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సత్యనారాయణ, గురుకుల పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.రాఘవేందర్‌రావు, కోశాధికారి వీరసోములు, గంగయ్య, సత్తిరెడ్డి, గణేషం, అశోక్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి : సామ రంగారెడ్డి

వనస్థలిపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి పార్టీ శ్రేణు లు కృషిచేయాలని పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ భూలక్ష్మీనగర్‌కాలనీ చౌరస్తాలో బీజేపీ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి రవికిరణ్ పొనుగుపాటి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ జెండాను సామ రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సోమవారం ఎగురువేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వి విధ పార్టీలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరారు. వీరికి సామ రంగారెడ్డి, రవికిరణ్‌లు బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సామ రంగారెడ్డి మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీజేపీని మరింతగా బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎల్బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, యూత్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి, అఖిల్, రితిక్, నాని, యశ్వంత్‌యాదవ్, నిఖిల్ పాల్గొన్నారు.

కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

చంపాపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని శ్రీరమణకాలనీ ఫేజ్-1లో మౌలిక సదుపాయాల కల్పనల కోసం కృషి చేయనున్నట్లు కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. కార్పొరేటర్‌ను సోమవారం కాలనీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు సంతోష్, కాలనీ ప్రతినిధులు బాలాజీ, రాజిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సైదాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం గాంధీనగర్ బస్తీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. కేంద్రానికి వచ్చే చిన్నారుల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. డివిజన్‌లో అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మహిళలకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో సీపీడీఓ పావని, టీచర్, హెల్పర్ పాల్గొన్నారు.

కేసన్, రెడ్డికుంట వాగులో అక్రమంగా పైప్‌లైన్

● పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



కేసన్‌కుంటను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్ : మండలంలోని గండిచెరువు గ్రామ పరిధిలోని రెడ్డి, కేసన్ కుంట వాగును సోమవారం ఇబ్రహీంపట్నం డివిజన్ ఇరిగేషన్ డీఈఈ చెన్నకేశవ రెడ్డి, ఏఈఈ వంశీధర్ పరిశీలించారు. వాగులో కొందరు వ్యక్తులు అక్రమంగా పైప్‌లైన్ వేసి మట్టితో పూడ్చివేస్తున్నారని ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు సదరు వాగును పరిశీలించారు. పైప్‌లైన్ వేసి మట్టితో పూడ్చివేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. చట్టపరమైన చర్య లు తీసుకుంటామని తెలిపారు. చెరువు, కుంటల ఆక్రమణకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

మన్సూరాబాద్ : సమాజ శ్రేయస్సులో భాగంగా ప్రతి ఒక్కరూ విధిగా రక్తదానం చేసి మరొకరి ప్రాణం నిలిపేందుకు ముందుకురావాలని మన్సూరాబాద్‌లోని ప్రసిద్ధ్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి చైర్మన్ జూకూరి చైతన్యరాజు వర్మ పేర్కొన్నారు. ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో గుండాల రమేష్, గందు రవీందర్, నిమ్మనగోటి నవీన్, నరేష్, భరత్, అశోక్‌రెడ్డి, అనిల్‌గౌడ్, వినయ్‌రెడ్డి, శంకుయాదవ్, కిరణ్ పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనానికి మోక్షం ఎప్పుడో..



● నిధులున్నా మధ్యలోనే ఆగిన భవన నిర్మాణ పనులు ● రేకుల షెడ్డులో ఇబ్బందులు పడుతున్న పాఠకులు

వనస్థలిపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : దాదాపు మూడు దశాబ్దాల క్రితం వనస్థలిపురం ఎన్జీవోస్‌కాలనీలో రంగారెడ్డి జిల్లా శాఖ గ్రంథాలయం రేకులషెడ్డులో ఏర్పాటు చేశారు. ఈ రేకులషెడ్డు శిథిలావస్థకు చేరడంతో పాఠకులు, ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. 1979లో నిర్మించిన ఈ షెడ్డులో ఏర్పాటు చేసిన కొన్ని గదుల్లో ఎన్జీవోస్‌కాలనీ సంక్షేమ సంఘం కార్యాలయం ఏర్పాటు చేశారు. లీజ్ కింద ఇక్కడి గదుల్లో 1991లో ఏర్పాటు చేసిన లైబ్రరీ ప్రస్తుతం శిథిలావస్థకు చేరినప్పటికీ అందులోనే నేటికీ కొనసాగుతుంది.

స్థలం కేటాయించినా అమలుకు నోచుకోని నూతన భవనం

ఐదు ఏళ్ల క్రితం ప్రస్తుత గ్రంథాలయం వెనుక భాగంలో నూతన గ్రంథాలయ నిర్మాణానికి ఎన్జీవోస్‌కాలనీ సంక్షేమ సంఘం 400 గజాల స్థలాన్ని కేటాయించింది. ఈ క్రమంలో రెండు సంవత్సరాల క్రితం నూతన గ్రంథాలయ నిర్మాణానికి సుమారు రెండు కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. ఆ వెంటనే రంగారెడ్డి జిల్లా శాఖ అధికారులు నూతన భవన నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు చేసి రెండు నెలల క్రితం పిల్లర్ గుంతలు తీసి పనులు ప్రారంభించారు. కానీ పనులు ఆ మరుసటి రోజే నిలిచిపోయాయి. రాజకీయ నాయకుల ప్రోద్బలంతోనే నూతన గ్రంథాలయ పనులు జరుగకుండా అర్ధాంతరంగా నిలిచిపోయినట్లు స్థానికులు తెలిపారు.



నూతన గ్రంథాలయం నిర్మాణానికి కేటాయించిన స్థలంలో తవ్వి వదిలేసిన పిల్లర్ గుంతలు

కనీస వసతులు కరువు..

వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, హయత్‌నగర్ డివిజన్లలో ని సుమారు 150కాలనీలకు సమీపంలో ఉన్న ఈ గ్రంథాలయంలో కనీస వసతులు లేకపోవడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు సుమారు 50 నుంచి 70మంది వరకు వచ్చే పాఠకులకు తాగునీరు, మూత్రశాలల సౌకర్యం లేకపోవడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మూత్ర విసర్జన చేయాల్సి వస్తే పక్కనే ఉన్న చెట్ల పొదలే వారికి ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో సమీపంలోని ఇళ్లవారికి దుర్గంధం వెదజల్లుతుందని కాలనీవాసులు వాపోతున్నారు. శిథిలావస్థలో ఉన్న రేకులషెడ్డులో కొనసాగుతున్న శాఖ గ్రంథాలయం చిన్నపాటి వర్షానికే గోడల పక్క నుంచి వర్షపునీరు లోపలికి చేరుతుందని, వేసవి కాలంలో ఉదయం 10గంటలు దాటితే విపరీతమైన వేడి రావడంతో అందులో కూర్చునే పరిస్థితి ఉండదని పాఠకులు తెలిపారు.

త్వరలోనే పనులు పునఃప్రారంభిస్తాం

నిలిచిపోయిన ఈ గ్రంథాలయ నిర్మాణ పనులను అతి త్వరలోనే పునఃప్రారంభిస్తాం. రాబోయే రెండు, మూడు రోజుల్లో గ్రంథాలయ ప్రాంతాన్ని పరిశీలించి పనులు కొనసాగించడానికి ఏర్పడిన సమస్యలను పరిష్కరించి పనులు ప్రారంభిస్తాం.

- రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

గ్రంథాలయ పనులు ప్రారంభించాలి



ఎంతో కాలంగా పాఠకులకు, ప్రభుత్వ అర్హత పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులకు, విద్యార్థులకు నిలయంగాఉన్న శాఖ గ్రంథాలయాన్ని త్వరితగతిన నిర్మించాలి. పలు రంగాల్లో పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులు, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణమే నూతన గ్రంథాలయ నిర్మాణ పనులు ప్రారంభించి సకాలంలో పాఠకులకు అందుబాటులోకి తీసుకరావాలి.

- కుమార్, పాఠకుడు

ప్రజయ్‌నివాస్ -1 సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

కొత్తపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి) : కొత్తపేట డివిజన్ పరిధి ప్రజయ్‌నివాస్ -1 అపార్టుమెంట్ల సముదాయంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ప్రజయ్‌నివాస్ -1 అధ్యక్షుడు వీ.రామారావు, ప్రతినిధులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలను విన్నవించారు. గత యేడాది ఆగస్టు 1న విద్యుత్‌శాఖ అధికారులు ప్రజయ్‌నివాస్-1లో నిర్వహించిన సమావేశంలో ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించామని వారి నుంచి స్పందన రాలేదని ప్రజయ్‌నివాస్ 1 ప్రతినిధులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి, ప్రజయ్ నివాస్ 1కు వెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, ప్రజయ్ నివాస్-1 ప్రతినిధులు లింగేశ్వర్‌రావు, సతీష్‌రెడ్డి, అనంత్, శ్రీనివాస్, శివ, ప్రసాద్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కాలనీల అభివృద్ధికి కృషి

వనస్థలిపురం : ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కాలనీల అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్ ఆధ్వర్యంలో సోమవారం అభ్యుదయనగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలో దెబ్బతిన్న రోడ్ల స్థానంలో నూతన రోడ్లు, చిన్న పిల్లలు ఆడుకోవడానికి ప్లేగ్రౌండ్‌ను నిర్మించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తప్పనిసరిగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గంగిరెడ్డి, ఆనంద్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ

● రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాంరెడ్డి

హయత్‌నగర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో పయనిస్తుందని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. సోమవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్‌లోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో జరిగిన మున్సిపాలిటీ సాధారణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో రోజు రోజుకు కొత్త కాలనీలు వస్తున్నాయని తెలిపారు. వాటన్నింటికీ మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. మరో మూడు నెలల్లో మున్సిపాలిటీలో పెండింగులో ఉన్న అన్ని రకాల అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. రూ.80లక్షలతో పార్కు స్థలాలకు ఫెన్సింగ్, రూ.3కోట్ల 75లక్షలతో అన్ని వార్డుల్లో యూజీడీ పనులు, వీధి దీపాలను ఏర్పాటు చేస్తామని అన్నారు. మున్సిపాలిటీ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోటి54లక్షలతో రోడ్డు రిపేరు పనులు, వాటర్ సప్లయి నిర్వహణ, భూగర్భ డ్రైనేజీ మరమ్మతులు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ అమరేందర్‌రెడ్డి, వైస్ చైర్ పర్సన్ హరిత, కౌన్సిలర్లు కౌశిక ఐలయ్య, సునీల్, కళ్యాణ్, బాల్‌రాజ్, మర్రి మాధవి, వేముల స్వాతి, కుంట ఉదయశ్రీ, హరిత, శ్రీలత, మల్లేష్ పాల్గొన్నారు.



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

● బాధితురాలికి నష్ట పరిహారం

రంగారెడ్డి కోర్టు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, జరిమానాతో పాటు బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని పోక్సోకోర్టు తీర్పుచెప్పింది. పీపీ సునీత బర్ల కథనం ప్రకారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బాలికపై ఇండ్ల కార్తీక్ అనే యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడని ఫిర్యాదు రావడంతో పోలీసులు కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలతో సహ కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన పోక్సోకోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 15 వేలు జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ. 3లక్షలు నష్టపరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

బాలిక కిడ్నాప్ కేసులో..

రంగారెడ్డి కోర్టు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బాలికను కిడ్నాప్ చేసి వివాహం చేసుకోవాలని బలవంతం చేసిన కేసులో నిందితుడికి జీవితఖైదు, జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని పోక్సోకోర్టు తీర్పు చెప్పింది. పీపీ సునీత బర్ల కథనం ప్రకారం సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కురుమూర్తి అనే యువకుడు ఓ బాలికను అహరించుకునిపోయి వివాహం చేసుకోవాలని బలవంతం చేశాడు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసుకుని విచారించి సాక్ష్యాధారాలతో సహ కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన పోక్సోకోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి నిందితుడికి జీవిత ఖైదు, రూ. 10 వేలు జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ. 3లక్షలు నష్టపరిహారం చెల్లించాలని తీర్పునిచ్చారు.

అంకితభావంతో పనిచేయండి : సీపీ సుధీర్‌బాబు



రాచకొండ కమిషనరేట్‌లో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న సీపీ సుధీర్‌బాబు తదితరులు

హైదరాబాద్ సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు సూచించారు. కమిషరేట్‌లో సోమవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొని సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపి, దిశా నిర్దేశం చేశారు. కొత్త సంవత్సరంలో నూతనోత్సాహంతో పనిచేయాలని, స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మాట్లాడాలని, నూతన చట్టాలపై అధికారులు, సిబ్బంది అవగాహన పెంచుకోవాలన్నారు. రాచకొండ పరిధిలో అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితోనే గరిష్ట శిక్షా రేటు సాధించగలిగామని, నేర నిరూపణలో రాచకొండ కమిషనరేట్ అగ్రస్థానంలో నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీపీలు అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, మినిస్టీరియల్ అధికారులు పాల్గొన్నారు.

అంబర్‌పేట ఆర్మ్‌డ్ హెడ్‌క్వార్టర్స్‌లో సోమవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలలో సీపీ సుధీర్ బాబు పాల్గొని అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో సివిల్, ట్రాఫిక్, క్రైం విభాగాలతో పాటు ఏఆర్ విభాగం కూడా సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు.

బడంగ్‌పేట్ మేయర్ భర్తకు మాతృవియోగం

● ఎమ్మెల్యే సబితారెడ్డి, ఇతర నేతల పరామర్శ



నర్సింహారెడ్డిని పరామర్శిస్తున్న కేఎల్లార్

సరూర్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాతారెడ్డి అత్తమ్మ, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి మాతృమూర్తి చిగిరింత సరోజనమ్మ(80) ఆదివారం రాత్రి కన్నుమూశారు. నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యం విషమించడంతో ఆదివారం రాత్రి మరణించారు. ఆమెకు ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు కాగా.. చిన్న కుమారుడు నర్సింహారెడ్డి బడంగ్‌పేట్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్‌గా పని చేశారు. ప్రస్తుతం ఆయన భార్య పారిజాతారెడ్డి మేయర్‌గా కొనసాగుతున్నారు. సరోజనమ్మ మృతి పట్ల పలువురు తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, టఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, మునిసిపల్ కమిషనర్లు సరస్వతి, కృష్ణమోహన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డితో పాటు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ఇతర నాయకులు, పలు పార్టీల నేతలు సరోజనమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నర్సింహారెడ్డి, పారిజాతారెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం బాలాపూర్‌లోని హిందూ శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు

చంపాపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సీఎంకు ఆయన శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని బాటసింగారం రైతుసేవా సహకార సంఘం 2025 సంవత్సరం నూతన క్యాలెండర్‌ను సోమవారం సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ నార్లకొండ మల్లమ్మ, డైరెక్టర్లు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, బాలనర్సమ్మ, మొగుళ్ల యాదిరెడ్డి, గంట శ్రీనివాస్‌రెడ్డి, మేకల రాములు, మేనేజర్ జక్కుల ఐలేష్‌యాదవ్, నాయకులు జంగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద పద్మశాలీలను ఆదుకుందాం : వెంకటేశ్వర్లు

మన్సూరాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నిరుపేద పద్మశాలీలను ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు సామాజిక కార్యక్రమాలలో పాల్గొనేందుకు ప్రతి పద్మశాలీ ఉద్యోగి ముందుకు రావాలని తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. టీపీయూఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సరం-2025 టేబుల్ క్యాలెండర్‌ని కమిటీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరందాసు యాదగిరి, సంస్థాగత కార్యదర్శి యాదగిరేందర్, ఉపాధ్యక్షుడు గుండు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి కడవేరు లక్ష్మీపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ, శిరందాసు కృష్ణయ్య, కార్యవర్గ సభ్యులు రాజేందర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీసీసీ మాజీ కార్యదర్శి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన డైరీని సోమవారం రామ్మోహన్‌గౌడ్ బీఎన్‌రెడ్డినగర్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సలహాదారులు కోటయ్య, ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, యాదగిరి, స్వామి, రామచంద్రం గౌడ్, వీరస్వామి, నర్సింహ, సత్యంగౌడ్, యూసఫ్ పాల్గొన్నారు.

మాల సంఘాల జేఏసీ నేతల అరెస్టు

చంపాపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ కార్యాలయం ముట్టడికి తరలివెళ్తున్న తెలంగాణ మాల సంఘాల జేఏసీ నేతలను పోలీసులు అరెస్టు చేసి కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ మాట్లాడారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, మాల సంఘాల జేఏసీ నాయకులు చెరుకు రాంచందర్‌తో పాటు మరో 10మంది ఉన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం : యాదయ్య

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు రాష్ట్రం అప్పుల్లో ఉందంటూ ప్రజలను మోసం చేస్తోందని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య విమర్శించారు. సోమవారం నిర్వహించిన సీపీఎం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ, మండల కమిటీ సభ్యులు గుండె శివకుమార్, ముత్యాలు, శ్రీశైలం, శ్రీనివాస్, సరిత పాల్గొన్నారు.

హమాలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి : ఉజ్జిని

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు ఉజ్జిని రత్నాకర్‌రావు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర్ హరిసింగ్‌నాయక్ ఆధ్వర్యంలో సోమవారం పండ్ల మార్కెట్‌లో హమాలీ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రత్నాకర్‌రావు హాజరయ్యారు. మార్కెట్ మెయిన్ రోడ్డు వద్ద ఏఐటీయూసీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మక్బుద్‌బాయి, ప్రధాన కార్యదర్శిగా చిన్నగౌడ్, కోశాధికారిగా పోషయ్య, ఉపాధ్యక్షులుగా షరీఫ్, రాములు, మున్నాబాయ్, అంజాద్‌ఖాన్‌ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పర్వతాలు, ముత్యాల యాదిరెడ్డి, శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కళ్యాణోత్సవం

హయత్‌నగర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునగనూర్‌లోని మల్లికార్జునస్వామి కళ్యాణోత్సవం ఆదివారం రాత్రి కనుల పండువగా జరిగింది. సోమవారం మల్లికార్జునస్వామిని రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ దంపతులు, మల్‌రెడ్డి యాదిరెడ్డి, అభిషేక్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ వేముల స్వాతిఅమరేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు గుత్త వెంకట్‌రెడ్డి, నక్క శ్రీనివాస్‌గౌడ్, అంజయ్య, మాణిక్‌రెడ్డి పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. మునగనూర్‌లోని మల్లికార్జునస్వామిని సోమవారం బీఆర్‌ఎస్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దండెం రాంరెడ్డి తన అనుచరులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.